ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

మంగళవారం 25 నవంబరు 2025

ప్రతి ధాన్యం బస్తా కొనుగోలు చేస్తాం: సబ్ కలెక్టర్

వీరఘట్టం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ రైతుల నుంచి ప్రతి ధాన్యం బస్తా కొనుగోలు చేస్తామని సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు. సోమవారం మరియగిరి సమీపంలోని కల్లాల్లో రైతులు నిల్వ చేసిన ధాన్యం నాణ్యతను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. వీరఘట్టం, పాలకొండ ధాన్యం మిల్లులకు త్వరలో బ్యాంకు గ్యారెంటీలు వస్తాయన్నారు. ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో వీఆర్‌వోలు, ఇతర అధికారులు ఉన్నారు.

పౌష్టికాహార లోపం

రానివ్వొద్దు

● గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించండి

● మంత్రి సంధ్యారాణి



6లో

రైతులకు అండగా

కూటమి ప్రభుత్వం

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి

ప్రకృతి వ్యవసాయం చేపట్టండి

● ఎమ్మెల్యే జయకృష్ణ

6లో

బాధితులకు న్యాయం చేయండి: ఎఎస్పీ



పాలకొండ: ఇసుక అక్రమ రవాణా కోసం గోపాలపురం వద్ద నాగావళి నదిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక దారి

● యథేచ్ఛగా అక్రమ రవాణా

● కొమరాడ, పాలకొండ మండలాల్లో భారీగా తవ్వకాలు

● చోద్యంచూస్తున్న అధికారులు

ఆగని ఇసుక దందా!



అంపిలి వద్ద ఇలా..

పార్వతీపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక దందా ఆగడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మాదిరిగానే ఇప్పుడు కూడా అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేపట్టి తరలించుకుపోతున్నారు. ముఖ్యంగా కొమరాడ, పాలకొండ మండలాల్లో భారీగా తవ్వకాలు జరుగుతున్నాయి. దీనివెనుక కొందరు టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తుండడంతో ఇసుకాసురులు మరింతగా రెచ్చిపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుకతో పాటు మట్టి అక్రమ రవాణా ఇష్టారాజ్యంగా జరిగేది. జిల్లాలోని నదులు, గెడ్డలు, చెరువులను అక్రమార్కులు గుల్ల చేసేవారు. ముఖ్యంగా కొమరాడ మండలంలోని కోనేరు రామభద్రపురం, పాలకొండ మండలం అంపిలి, అన్నవరం, గొట్టమంగళాపురం తదితర ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేసేవారు. వైసీపీ నాయకులు ప్రకృతిని వదలడం లేదని, పంచభూతాలను దోచుకుంటున్నారని అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు ఆందోళనలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇసుక దందాకు అడ్డుకట్ట పడుతుందని అంతా భావించారు. కానీ, టీడీపీకి చెందిన కొందరు ద్వితీయ శ్రేణి నాయకులే తెరవెనుక ఉండి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. కొమరాడ మండలంలోని కోనేరు రామభద్రపురం రీచ్ నుంచి ఇసుక తరలింపు కోసం వైసీపీ నాయకులకు టీడీపీ నేతలు పూర్తి స్థాయిలో సహకారాలు అందిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణాలో గత పాలకులకు తామేమీ తక్కువ కాదని నిరూపించుకుం టున్నారు. ఈ రీచ్ నుంచి ఈ నెల 18న 20 లారీల ఇసుకను అక్రమంగా తరలించినట్లు 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చింది. దీంతో తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది ఆ రీచ్‌ను పరిశీలించారు. అయితే, అక్కడ ఎలాంటి యంత్రాలు లేవని చెప్పి వారు తిరిగి వెళ్లిపోవడంపై విమర్శలు వ్యక్తమవు తున్నాయి. పాలకొండ నియోజకవర్గంలో అంపిలి, అన్నవరం, గొట్టమంగళాపురం తదితర ప్రాంతాల్లో కూడా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.

'ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై ఫిర్యాదులు అందిన వెంటనే ర్యాంప్‌ల వద్దకు వెళ్లి పరిశీలిస్తున్నాం. ఆ ప్రాంతంలో ప్రత్యేకించి ట్రెంచ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకునేందుకు మా సిబ్బందిని అందుబాటులో ఉంచుతాం.' అని పాలకొండ తహసీల్దార్ రాధాకృష్ణ తెలిపారు.

కన్నీటి సంద్రం

● జంఝావతిలో గల్లంతైన ముగ్గురు యువకుల మృతి ● కన్నీటిపర్యంతమైన కుటుంబ సభ్యులు ● సివినిలో విషాద ఛాయలు

కొమరాడ, నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఆశలు గల్లంతయ్యాయి.. చివరకు కన్నీళ్లే మిగిలాయి. జంఝావతి రబ్బరు డ్యామ్‌లో ఆదివారం స్నానానికని దిగి గల్లంతైన ముగ్గురు యువకులు మృతి చెందారు. సోమవారం విగతజీవులుగా కనిపించారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు భోరున విలపించారు. వారి జ్ఞాపకాలను తలచుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు. మరోవైపు స్వగ్రామం సివినిలో కూడా విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. నాగావళిలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టిన పోలీసు, అగ్నిమాపక సిబ్బంది.. సోమవారం వేకువజామున గుంప సోమేశ్వరాలయం సమీపంలోని నది తీరంలో అధికారి గోవింద నాయుడు, అరసాడ ప్రదీప్ మృతదేహాలను గుర్తించారు. సాయంత్రం కోటిపాం సమీపంలోని కారిరేవు వద్ద రాయగడ శరత్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో పోస్టుమార్టం పూర్తయిన తర్వాత కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించారు. గోవింద, ప్రదీప్ అంత్యక్రియలు పూర్తయినట్లు ఎస్ఐ కె.నీలకంఠం తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

మృతుల కుటుంబాలకు మంత్రి పరామర్శ

బెలగాం: పార్వతీపురం జిల్లాకేంద్రాసుపత్రిలో మృతుల కుటుంబ సభ్యులను మంత్రి

(మిగతా 8వ పేజీలో...)



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సంధ్యారాణి



గోవిందనాయుడు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కాలువ మింగేసింది

● స్నానానికి దిగి ఓ విద్యార్థి మృతి ● నందివానివలసలో ఘటన

గరుగుబిల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలంలో జంఝావతి ఘటన మరువకముందే గరుగుబిల్లిలో మరో విషాదం చోటుచేసుకుంది. స్నానానికని నాగావళి ఎడమ కాలువలో దిగి ప్రమాదవశాత్తూ ఓ ఇంటర్ విద్యార్థి మృతి చెందాడు. గరుగుబిల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తోటపల్లి పంచాయతీ నందివానివలస గ్రామానికి చెందిన మణికంఠ (17) కురుపాం కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రోజూలానే సోమవారం ఉదయం స్నేహితులతో కలిసి తోటపల్లి జడ్పీ హైస్కూల్ వైపు వాకింగ్‌కు వెళ్లాడు. కొంత సేపటి తర్వాత స్నానం చేసేందుకు నాగావళి ఎడమ కాలువలో ఆ విద్యార్థి దిగాడు. అయితే కాలు జారి కాలువలోని గోతిలో చిక్కుకుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. స్నేహితులు ఎస్.మహేష్, జి.సాయితేజ, పి.యశ్వంత్‌లు మణికంఠను రక్షించేందుకు ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు రవికుమార్, చిన్నమ్మ, సోదరి హుటాహుటిన ఆప్రాంతానికి చేరుకున్నారు. స్థానికుల సాయంతో గోతిలో చిక్కుకున్న మణికంఠ మృతదేహాన్ని బయటకు తీయించారు. విగతజీవిగా పడి ఉన్న తనయుడిని చూసి తల్లిదండ్రులు తట్టుకోలేకపోయారు. పోలీస్ ఉద్యోగం సాధించి... కుటుంబానికి అండగా ఉంటాన్న కుమారుడు ఇక లేడని తెలిసి వారు కన్నీరుమున్నీరయ్యారు. వారిని ఓదార్చడం ఎవరివల్లా కాలేదు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ ఎస్.ఈశ్వరరావు తెలిపారు.



మణికంఠ (ఫైల్)

ఇలా అయితే.. ఉద్యోగాలు చేయలేం 6లో

స్టీల్‌ప్లాంట్‌కు భూములిచ్చేది లేదు

● రొడ్డక్కిన ఆరు గ్రామాల రైతులు

● జీవో-221ను రద్దు చేయాలని డిమాండ్

6లో

అర్జీలను వెంటనే పరిష్కరించండి

● పీజీఆర్ఎస్‌లో అధికారులకు కలెక్టర్ ఆదేశం

అత్యాచార కేసులో నిందితుడికి 12 ఏళ్ల జైలు

7లో

ఉత్తరాంధ్రలో గంజాయి

సాగు తగ్గించాం

●విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ ఏడాది గంజాయి సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా తగ్గించగలిగామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి తెలిపారు. సోమవారం ఎల్విన్‌పేట పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ..' అల్లూరి సీతారామరాజు ఏజెన్సీ ప్రాంతంలో 11,000 ఎకరాల్లో గంజాయి సాగు జరిగేది. ఈ ఏడాది 93 ఎకరాలకు సాగు తగ్గింది. డ్రోన్లు, శాటిలైట్ ద్వారా గంజాయి సాగును గుర్తిస్తున్నాం. వేలాది ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటలు వేయడానికి చర్యలు తీసుకున్నాం. గంజాయి రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టడానికి చర్యలు తీసుకుం టున్నాం. ఏవోబీ సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నాం. ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నాం. గతంలో పోలిస్తే ఒడిశా నుంచి ఏపీ మీదుగా గంజాయి రవాణా బాగా తగ్గింది. బస్సులు, రైళ్లు, కార్లు, ఇతర వాహనాల్లో రవాణా చేస్తున్న వారిపై నిఘా పెట్టాం.' అని తెలిఆపరు.

కేసులు నమోదు ఇలా..

'గత ఏడాది 867 గంజాయి కేసులను నమోదు చేసి 20,467 మందిని అరెస్టు చేశాం. 65 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేశాం. 500 వాహనాలను సీజ్ చేశాం. సంకల్పం పేరిట గంజాయికు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నాం. ఇప్పటివరకు 12 లక్షల మంది విద్యార్థులు, యువత, మహిళా సంఘాలకు అవగాహన కల్పించాం. అభ్యుదయం పేరిట గంజాయి, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు సైకిల్ యాత్ర నిర్వహి స్తున్నాం. విద్యార్థినులకు పోక్సోపై అవగాహన కల్పిస్తున్నాం. సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్‌లపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే తగిన చర్యలు తీసుకుంటున్నాం. బాధితుల నగదు రికవరీ చేయడానికి కృషి చేస్తున్నాం. ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం.' అని డీఐజీ వెల్లడించారు

మన్యంలో తగ్గిన క్రైం రేటు

'పార్వతీపురం మన్యం జిల్లాలో క్రైం రేటు తగ్గింది. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. దీనిపై ఆర్అండ్‌బీ అధికారులతో చర్చిస్తున్నాం. డ్రంకెన్ డ్రైవ్ చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయి.' అని డీఐజీ తెలిపారు. ఆయన వెంట ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్పీ వెంకటేశ్వరరావు, పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐలు, ఎస్ఐలు తదితరులున్నారు.



పాలకొండలో పెట్రోల్ బంక్ ప్రారంభిస్తున్న డీఐజీ గోపీనాథ్ జట్టి

పెట్రోల్ బంక్ ప్రారంభం

పాలకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఆర్టీసీ డిపో సమీపంలో

(మిగతా 8వ పేజీలో...)

నేటి నుంచి పుస్తక మహోత్సవాలు

8లో

● పార్వతీపురంలో ఏర్పాట్లు పూర్తి

చిన్నపల్లంకిలో మలేరియా పరీక్షలు

8లో

33 మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు పదోన్నతి

8లో

అటకెక్కిన 'స్వచ్ఛరథాలు'

7లో

● నీరుగారిన ప్రభుత్వ లక్ష్యం



ఐటీడీఏలో అక్రమాలపై విచారణ

● అవకతవకలపై విజిలెన్స్‌కు దళితసంఘాల ఫిర్యాదు

● రేపు ముగ్గురు అధికారులపై దర్యాప్తు

● గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశం



టెక్కలి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏలో ముగ్గురు అధికారుల అవినీతి, అక్రమాలపై విచారణకు రంగం సిద్ధమైంది. ఐటీడీఏ పరిధిలో జరిగిన అక్రమాలపై దళిత సంఘాల జేఏసీ ఫిర్యాదు మేరకు ఈ నెల 26న విచారణ చేపట్టాలని గిరిజన సంక్షేమ డైరెక్టర్ ఆదేశించారు. ఇందుకు సంబంధించి ట్రైకార్ ఎండీ సీఏ మణికుమార్‌ను దర్యాప్తు అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

● వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐటీడీఏ పరిధిలోని సీఆర్టీల రెగ్యులైజేషన్‌లో అవకతవకలు జరిగాయి. కొంతమంది దగ్గర డబ్బులు తీసుకొని బ్రేక్ సర్వీస్ ఉన్న వారికి కూడా రెగ్యులరైజ్ చేశారు.

● జువైనెల్ ఏపీ హైకోర్టు ఆదేశాలకు భిన్నంగా అక్రమ బదిలీలు, డిప్యుటేషన్లు చేపట్టారు. ఈ ఏడాది మే నెలలో జరిగిన బదిలీల్లో అధికారులకు అనుకూలంగా ఉన్నవారికి కోరుకున్నచోట స్థానాలు ఇచ్చారు. టెక్కలి ఆశ్రమ పాఠశాలలో సీనియర్ జాబితాలో ఆరవ స్థానంలో ఉన్న ఉపాధ్యాయుడికి స్థానం ఇవ్వకుండా, 64వ స్థానంలో ఉన్నవారికి అవకాశం ఇచ్చారు. బాలికల పాఠశాలలకు పురుష టీచర్లను నియమించారు. బదిలీల తర్వాత అనేకమందికి అక్రమ డిప్యుటేషన్లు కూడా వేశారు. బందపల్లి బాలికల పాఠశాల నుంచి మహిళా టీచర్‌ను టెక్కలి బాయ్స్ స్కూల్‌కి, టెక్కలిలో ఉన్న ఉపాధ్యాయుడిని బందపల్లి గర్ల్స్ స్కూల్‌కి డిప్యుటేషన్ వేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా మెళియాపుట్టి ఏటీడబ్ల్యూవోను,

(మిగతా 8వ పేజీలో...)

గిరిజన యువతకు సివిల్స్ కోచింగ్

● ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్

సీతంపేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న గిరిజన నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ పాసైన అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. విద్య, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో పాటు ఆధార్, పాన్‌కార్డు, రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో ఈనెల 26 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.8లక్షలలోపు ఉండాలని తెలిపారు. విశాఖ, విజయవాడ, తిరుపతి కేంద్రాల్లో ఉచిత శిక్షణ ఉంటుందన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

● కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి

బెలగాం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో రైతన్నా.. మీ కోసం' కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'రైతన్నా...మీ కోసం' పై విస్తృత ప్రచారం చేయాలన్నారు. రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. బహుళ పంటలు సాగు చేసేలా చూడా లన్నారు.

పరిశుభ్రత, మౌలిక వసతులపై నివేదిక

జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేసి

(మిగతా 8వ పేజీలో...)



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి

రైతు సంక్షేమమే ధ్యేయం

● జిల్లా వ్యాప్తంగా 'రైతన్నా- మీకోసం' కార్యక్రమం

రైతు సంక్షేమమే ధ్యేయమని ప్రజా ప్రతినిధులు, అధికారులు తెలిపారు. సోమవారం ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల రైతన్నా- మీకోసం కార్యక్రమం నిర్వహించారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

● ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి



ఉల్లిభద్రలో అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గరుగుబిల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండ గా కూటమి ప్రభుత్వం ఉంటోందని ప్రభుత్వ విప్ తో యక జగదీశ్వరి అన్నారు. సోమవారం ఉల్లిభద్రలో ని ర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆమె పాలొ న్నారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులను ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ముఖ్యమంత్రి చంద్రబా బు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడులు పంచ సూత్రాలను అమలు చేస్తున్నారన్నారు. వ్యవసాయాన్ని అబివృద్ధి చేస్తూ అన్నదాతలకు మేలు చేకూర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవచూపు తోందన్నారు. సాగునీటి యాజమాన్యం, రాయితీపై బిందు సేద్యం, మేలైన విత్తనాలు, ఉద్యాన రైతులకు ఉజ్వల భవిష్యత్‌ను అందించేందుకు పలు రకాల పథకాలను అమలు చేస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ పథకంపై రైతుల నుంచి అభిప్రాయాలు సేక రించారు. సంబంధిత సిబ్బంది రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, కార్పొరేషన్ డైరెక్టర్ ఎ.రాంబాబు, ఎ.మధుసూదనరావు, టీడీపీ నాయకులు ఎం.తవిటి నాయుడు, మండల కన్వీనర్ ఎం.నారాయణస్వామి, ఎం.పురుషోత్తంనాయుడు, ముదిలి బాబు విజయవాంకుశం, కోట సుమన్, మండల వ్యవసాయాధికారి టి.జ్యోత్న పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

ప్రకృతి వ్యవసాయం చేపట్టండి

● పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

పాలకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం వెలగవాడలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు, ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగ నిపుణుల సూచనలతో మెరుగైన ఆదాయం, వ్యవసాయాభివృద్ధికి తోడ్పడుతోందన్నారు. ప్రభుత్వ పథకాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ రత్నకుమారి, ఏవో ప్రసాదరావు, కూటమి నాయకులు కర్నేన అప్పలనాయుడు, చీమల కృష్ణారావు, వాకముడి అనీల్‌కుమార్, సుగుణాకరరావు, కిమిడి కాశింనాయుడు, వెన్నపు శ్రీనివాసరావు, రాజేశ్, కె.గంగునాయుడు, బొమ్మాళి సుధాకర్, వరహా లనాయుడు, ప్రశాంత్, వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

పండగలా వ్యవసాయం

● చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు

చీపురుపల్లి, ఆంధ్రజ్యోతి 24(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. మెట్టపల్లిలో సోమవారం జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆ యన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అన్నదాతకు పెట్టుబడి సాయం అందించడమే కాకుండా పండించిన పంటకు గి ట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తోందన్నారు. గత ప్రభుత్వం హయాంలో రైతులు ఎదు ర్కొన్న ఇబ్బందులు తొలగించి, వ్యవసాయాన్ని పండగలా మార్చే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. అనం తరం, స్థానికంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. రైతు సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నా యకులు కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, దన్నాన రామ చంద్రుడు, బూటు శ్రీను, ఎంపీడీఓ ఐ. సురేష్, వ్యవసాయ శాఖ ఏడీ ఎస్.కోటేశ్వరరావు, ఏఓ సూర్యకుమారి తది తరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపం రానివ్వొద్దు

● గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించండి

● మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



పదోన్నతి పత్రాలు అందిస్తున్న మంత్రి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ జగదీశ్వరి, ఎమ్మెల్యే జయకృష్ణ, కలెక్టర్, జేసీ, సబ్ కలెక్టర్

బెలగాం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూడాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వన్ స్టాప్ సెంటర్ ఆవరణలో నిర్వహించిన బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడమే కాకుండా వాటిని వారు సక్రమంగా వినియోగించేలా చూడాలన్నారు.. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో ముస్తాబు కార్యక్రమం జరుగుతోందన్నారు. దాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. ప్రతి కేంద్రంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి సున్నితమైన అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కార్యకర్తలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందన్నారు. ఈ ప్రభుత్వ హయాంలోనే జీతాలు పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. ఏడు వేల మినీ అంగన్‌వాడీలను ఐదు వేలు మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చామన్నారు. మిగిలిన 2వేల మంది పదో తరగతి ఉత్తీర్ణత సాధించకపోవడం వల్ల మార్చలేదన్నారు. వారికి ఏడాది గడువు ఇచ్చామన్నారు. పదో తరగతి పాసైతే వారికి పదోన్నతి కల్పిస్తామన్నారు. జిల్లాలో ప్రస్తుతం 217 మందికి అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతి కల్పిస్తున్నామన్నారు. అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ సౌకర్యం కల్పించిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మహిళలను మహారాణులను చేయడమే సీఎం చంద్రబాబు ధ్యేయమన్నారు. అర్హులకు ఆయాలుగా ఇస్తామని, అందరికీ మంచి చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనపై మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. పదోన్నతి పత్రాలను కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డితో కలిసి కార్యకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ వైశాలి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

● రామతీర్థంలో అపరిశుభ్రతపై ఎమ్మెల్యే నాగమాధవి ఆగ్రహం



దేవాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

నెల్లిమర్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రోజువారీ పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని అధికారులను ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆదేశించారు. రామతీర్థం దేవాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే ఆకస్మికంగా సందర్శించారు. ఆలయ పరిశరాల పరిశుభ్రతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దేవాలయం లోపల, వెలుపల పరిశుభ్రత సరిగా నిర్వహించకపోవడంతో పాటు చెత్త సకాలంలో తొలగించడం లేదని వచ్చిన సమాచారం మేరకు ఆమె ఆకస్మిక సందర్శించారు. సిబ్బందిని, అధికారులను పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి దేవాలయ పరిసరాలు, అంతర్గత ప్రదేశాలు పూర్తిగా శుభ్రంగా, భక్తులకు ఇబ్బంది కలగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశుభ్రత పట్ల నిర్లక్ష్యం కనబరిస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆలయంలో బాత్రూములు శుభ్రంగా లేవని, భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఒకరు సోషల్ మీడియాలో పోస్టు చేసినట్లు సమాచారం. విషయం తెలిసన వెంటనే ఎమ్మెల్యే నాగమాధవి స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆ ప్రాంతాన్ని మరింత మెరుగుపరిచే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రోజువారీ పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. రామతీర్థం దేవాలయానికి అధిక సంఖ్యలో భక్తులు వస్తుండడంతో వారి సౌకర్యం కోసం పరిశుభ్రత పట్ల ఎలాంటి రాజీ ఉండకూడదని ఆమె సూచించారు.

స్టీల్‌ప్లాంట్‌కు భూములిచ్చేది లేదు

● రోడ్డెక్కిన ఆరు గ్రామాల రైతులు

● జీవో-221ను రద్దు చేయాలని డిమాండ్

● తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

● మద్దతుగా నిలిచిన వివిధ రాజకీయ పార్టీలు



తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న రైతులు



తహసీల్దార్‌కి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

గుర్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌కు భూములిచ్చేది లేదని ఎస్ఎస్ఆర్ పేట, వల్లాపురం, దమరసింగి, మన్యపురిపేట, కెల్ల, బెల్లానపేట గ్రామస్థులు తేల్చి చెప్పారు. సోమవారం ఆయా గ్రామాలకు చెందిన రైతులు స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించగా, వివిధ రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయి. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డుపై రైతులు మూడు గంటలపాటు బైఠాయించి నిరసన తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను నిర్మించడానికి అంగీకారం లేకుండా బలవంతంగా తమ భూములు తీసుకోబోమని తెలియజేస్తూ లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాలని తహసీల్దార్‌ను డిమాండ్ చేశారు. దీనికి తహసీల్దార్ పిటాపురపు ఆదిలక్ష్మి అంగీకరించలేదు. ప్రభుత్వం తీసుకున్న పాలసీ నిర్ణయాలకు ఉద్యోగులుగా కట్టుబడి ఉంటామని తెలిపారు. అయితే గ్రామస్థుల నుంచి వస్తున్న వ్యతిరేకతను ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు. దీనికి అంగీకరించని రైతులు తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. ఆ సమయంలో విజయనగరం-పాలకొండ ప్రధాన రహదారిపై బైఠాయించి రైతులు నినాదాలతో హోరెత్తించారు. జీవో-221 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పచ్చని భూములను వదులుకునేది లేదని తేల్చి చెప్పారు. పోలీసులు ఉద్యమ నేతలతో చర్చల అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వ్యవసాయ, కార్మిక సంఘ రాష్ట్ర కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. రైతుల పాడెపై స్టీల్ ప్లాంట్‌ను కట్టాలన్నారు. మండలంలోని కెల్ల, దమరసింగి, బెల్లానపేట, మన్యపురిపేట, ఎస్ఎస్ఆర్ పేటల్లో 1200 ఎకరాల్లో రూ.8,500 కోట్లతో పశ్చిమబెంగాల్‌కు చెందిన సూపర్ స్మెల్టర్స్ ప్రైవేట్ కంపెనీ గ్రీన్ ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్‌ను నిర్మించనున్నట్లు ప్రభుత్వం జారీచేసిన జీవో-221 రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఏడాదికి రెండు పంటలు పండుతున్న పచ్చని పొలాల్లో స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి రైతుల జీవితాలను నాశనం చేయొద్దన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఒకవేళ తప్పని పరిస్థితుల్లో రైతుల నుంచి భూమిని తీసుకోవాల్సి వస్తే ల్యాండ్ ఎక్విజేషన్ చట్టం-2013 నిబంధనల ప్రకారం సంబంధిత రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కేవీ సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, సీర అప్పలనాయుడు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, కెల్ల భీమారావు, జనసేన పార్టీ నాయకులు విజిగిరి శ్రీనివాసరావు, రమేష్‌రాజు, బడిగంటి వెంకటరమణ, మీసాల ప్రసాద్, దమరసింగి సర్పంచ్ మీసాల కల్యాణి పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయండి

● ఏఎస్పీ వెంకటేశ్వరరావు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఏఎస్పీ వెంకటేశ్వరరావు

బెలగాం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులపై అలసత్వం వహించకుండా సత్వరమే బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఏఎస్పీ వెంకటేశ్వరరావు ఆదేశించారు. సోమవారం పోలీస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో నాలుగు అర్జీలను ఏఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారుల ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఎస్ఐ రమేశ్‌నాయుడు పాల్గొన్నారు.

వినతులు నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలి

● పీజీఆర్ఎస్‌కు 260 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చే వినతులు నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని జేసీ సేతు మాధవన్ ఆదేశించారు. సోమవారం విజయనగరం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమంలో 206 వినతులు వచ్చాయి. వీటిని జేసీ సేతు మాధవన్, డీఆర్వో శ్రీనివాస్ మూర్తి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గతంలో కంటే పెండింగ్ వినతులు సంఖ్య తగ్గిందని తెలిపారు. రెవెన్యూ శాఖకు వస్తున్న వినతులకు సంబంధించి తహసీల్దార్లు ఆయా అర్జీదారులతో మాట్లాడకుండా వీఆర్వోలు, సీనియర్ అసిస్టెంట్లు మాట్లాడం సరికాదని సూచించారు. అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలన్నారు.

బస్తాకి ఐదు కిలోలు అడుగుతున్నారు..

ధాన్యం సేకరణలో మిల్లర్లు చేతి వాటం చూపించి, బస్తాకు ఐదు కేజీలు చొప్పున ధాన్యం అదనంగా అడుగుతున్నారని మెరకముడిదాం మండలంలోని భైరిపురం గ్రామానికి చెందిన రైతులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో విన్నవించారు. తాము పండించిన ధాన్యానికి మిల్లర్లు అధికంగా డబ్బులు అడగడం సరికాదని పేర్కొన్నారు. ప్రస్తుతం తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో పండిన పంటను కోసి నూర్పులు వేసిన తర్వాత మిల్లులకు ధాన్యం ఇస్తే క్వింటాకు ఐదు కేజీలు అడుగుతున్నారని పిర్యాదు చేశారు. ఈవిషయంపై వెంటనే విచారణ చేసి న్యాయం చేయాలని భైరిపురం గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాస్ ,టి.సత్యం తదితరులు కోరారు.

ఇలా అయితే.. ఉద్యోగాలు చేయలేం

కొమరాడ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కొమరాడలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన నలుగురు సచివాలయ కార్యదర్శులను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అయితే వారికి నోటీసులు ఇవ్వకుండా, ఎటువంటి వివరణ తీసుకోకుండా సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ఆ మండలానికి చెందిన కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు. ఇలా అయితే ఉద్యోగాలు చేయలేమంటున్నారు. మరోసారి క్షేత్రస్థాయిలో విచారణ చేసి.. వారం రోజుల్లోగా న్యాయం చేయాలని లేకుంటే సామూహిక సెలవు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు. ఈ మేరకు 26 మంది పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీవో ఎస్.రమేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీవో తెలిపారు.

ఎంపీడీవోకి వినతి పత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు →



అర్జీలను వెంటనే పరిష్కరించండి

● మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి

బెలగాం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అందిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 92 వినతులను కలెక్టర్ స్వీకరించారు. నాలుగు నెలలుగా కొమరాడ మండలం గుణానుపురంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్ లేకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఎం.పద్మావతి పిర్యాదు చేశారు. ఇంటిపైన విద్యుత్ తీగలను తొలగించాలని పిన్నింటి రామినాయుడువలసకు చెందిన టి.సంగయ్య వినతిపత్రం అందజేశారు. తనకు ఇంటి స్థలం మంజూరు చేయాలని పార్వతీపురం మండలం చప్పవానివలసకి చెందిన బిరసయ్య కోరారు. కార్యక్రమంలో జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి, డీఆర్వో హేమలత, సబ్ కలెక్టర్ వైశాలి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలి

● విజయనగరం ఎస్పీ ఏఆర్ దామోదర్



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్ పరిధిలో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించి చట్ట పరిధిలో న్యాయం చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం విజయనగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి 39 ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలు విచారణ చేసి ఫిర్యాదు అంశాల్లో వాస్తవాలు ఉండే చట్ట పరిధిలో న్యాయం చేయాలని ఆదేశించారు. తీసుకున్న ఫిర్యాదులను ఏడు రోజుల్లో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుని, తీసుకున్న చర్యల వివరా లను నివేదిక రూపంలో జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, ఎస్బీ సీఐ లీలారావు, డీసీఆర్బీ సీఐ కుమారస్వామి, ఎస్ఐలు ప్రభావతి, రాజేష్ పాల్గొన్నారు.

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

● సమస్యలు పరిష్కరించాలని జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందజేసిన ఆయా సంఘాల నాయకులు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

తమ సమస్యలు పరిష్కరించాలని వివిధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ దద్దరిల్లింది. అనంతరం జిల్లా అధికారులకు ఆయా సంఘాల నాయకులు వినతిపత్రాలు అందజేశారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

విజయనగరం టౌన్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి):నగరంలో నివాసం ఉన్నచోటే పేదలకు ఇళ్లపట్టాలను ఇవ్వాలని, దీనికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం జీవో జారీచేసి ఏడాది పూర్తయినా పట్టాలు మంజూరులో అలసత్వం చూపుతున్నారని సీపీఎంజిల్లా కార్యదర్శి రెడ్డిశంకరరావు ఆరోపించారు. కలెక్టర్ వద్ద నిర్వాసితులతో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని జొన్నగుడ్డి, ఎల్‌బిజీనగర్, గురజాడనగర్, ఫూల్ బాగ్, గంజిపేట, గొడగల వీధి,స్టేడియం కాలనీ, నల్లచెరువు, దాసన్నపేట, ఎర్రచెరువులో దశాబ్దాలుగా పేదలు నివాసముంటున్నా వారికి ఇప్పటికీ పట్టాలు ఇవ్వలేదని తెలిపారు.

హెచ్ఆర్‌పాలసీ అమలుచేయాలి

ఏపీ సమగ్రశిక్ష ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న ఒప్పంద, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్ఆర్‌పాలసీ, ఎంటీఎస్‌ను అమలుచేయాలని సమగ్రశిక్ష ఉద్యోగులు కోరారు. ఈమేరకు విజయనగరంలోని కలెక్టరేట్ వద్ద అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా జేఏసీ అధ్యక్షుడు కాంతారావు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత లేకుండా తక్కువ వేతనాలతో ఉద్యోగులుఇబ్బందిపడుతన్నారని, ప్రభుత్వం ఏర్పాటై 18 నెలలుపూర్తయినా హామీలను నెరవేర్చలేదని తెలిపారు.సమగ్రశిక్ష ఉద్యోగులకు సర్వీస్ వెయిటేజ్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులైజ్‌చేయాలని, వేతనాలు పెంచడమే కాకుండా సకాలంలో చెల్లించాలని జేసీ సేతుమాధవన్‌కు వినతిపత్రం అందజేశారు.

మైక్రోఫైనాన్స్ ఆగడాలపై చర్యలు చేపట్టాలి

మైక్రోఫైనాన్స్ ఆగడాలపై చర్యలు చేపట్టాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పుణ్యవతి కోరారు. కలెక్టరేట్ వద్ద బాధిత మహిళలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోనివడ్డీవ్యాపారులపై దర్యాప్తు చేసి అధిక వడ్డీలు వసూళ్లు చేసేవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి పాలూరు రమణమ్మ పాల్గొన్నారు.

రిజర్వేషన్ లేక..

జిల్లాలోని యాత కులస్థులపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని కల్లుగీత కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు పురం అప్పారావు ఆరోపించారు. కలెక్టరేట్ వద్ద గీత కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యాత కులం అన్నిరంగాలలో వెనుకబడి ఉందని, ప్రత్యేక రిజర్వేషన్ లేక తమ పిల్లలకు తగిన అవకాశాలు అందలేకపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కె.కోటారావు, రామారావు, పి.సత్యం, ఫణి, రామారావు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఉద్యోగభద్రత కల్పించాలని, కనీసవేతనం రూ.26 వేలుఇవ్వాలని క్షేత్ర సహాయకులు కోరారు.విజయనగరంలోని మహారాజా ఆసుపత్రి నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు.ఈసందర్భంగా సంఘ అధ్యక్షుడు భోగాపురపు రాజారావు మాట్లాడుతూ క్షేత్రసహాయకులను బదిలీలు చేపట్టాలని కోరారు. టార్గెట్ విధానం రద్దుచేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జేసీ సేతు మాదవన్‌కు అందజేశారు. ఈ కార్య క్రమంలో జిల్లాలోని 557 మంది క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

రాజాంలో వివాహిత ఆత్మహత్య


సావిత్రి (ఫైల్)

రాజాం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజాంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. రాజాం టౌన్ సీఐ అశోక్‌కుమార్ కథనం మేరకు.. భామిని మండలం బాలేరుకు చెందిన ఉర్లాపు సావిత్రికి కొత్తూరు మండలంలోని పారాపురానికి చెందిన గణపతితో వివాహం జరిగింది. వారికి పాప, బాబు ఉన్నారు. రెండేళ్ల కిందట పాలకొండలో ఓ ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్న మన్మథకుమార్ రుణం ఇప్పిస్తానని సావిత్రిని నమ్మబలికి ఆమెతో స్నేహంప్రారంభించి కొనసాగిస్తూవచ్చాడు. కొన్నాళ్ల తర్వాత మన్మథకుమార్ సావిత్రిపై ఒత్తిడి తేవడం ప్రారంభించాడు. దీంతో సావిత్రి తన భర్తను, కుమారుడిని కొత్తూరులో వదిలిపెట్టి కుమార్తెను తీసుకుని రాజాంలోని సారధి రోడ్‌లో ఆయన తీసుకున్న అద్దె ఇంట్లో నివాసముంటూ పట్టణంలోని ఓ షాపింగ్‌మాల్‌లో పనిచేస్తోంది. ఇటీవల మన్మథకుమార్ సావిత్రిని కొట్టడం, శారీరకంగా, మానసికంగా వేధించడంతో తట్టుకోలేక సావిత్రి (30) ఆదివారంరాత్రి తన ఇంట్లో బెడ్ రూంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సావిత్రి తల్లి పోతల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజాం టౌన్ సీఐ. అశోక్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 12 ఏళ్ల జైలు

విజయనగరం క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):గరివిడి మండలానికి చెందిన సవిరిగాణ సూర్యనారాయణకు అత్యాచారం కేసులో విజయనగరం ఐదో ఏడీజే మహిళా కోర్టు న్యాయాధికారి ఎస్.పద్మావతి 12 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రెండు వేలు జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. ఎస్పీ కథనం మేరకు.. ఓ గ్రామానికి చెందిన మహిళ 2019 సెప్టెంబరు 19న తన పశువుల శాలలో పశువులకు మేతవేస్తుండగా, అదే గ్రామానికి చెందిన సూర్యనారాయణ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ విషయంపై సదరు మహిళ ఇచ్చిన ఫిర్యాదుమేరకు అప్పటి గరివిడి ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ 2019 సెప్టెంబరు 20న కేసు నమోదుచేశారు. అనంతరం అప్పటి చీపురుపల్లి సీఐ సీహెచ్ రాజులనాయుడు కేసు దర్యాప్తు చేసి నిందితుడ్ని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.న్యాయస్థానంలో అభియోగపత్రాలు దాఖలు చేయగా, నిందితుడిపై నేరారోపణలు రుజువుకావడంతో న్యాయాధికారి జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో నిందితుడిపై నేరారోపణలు రుజువయ్యే విధంగా పనిచేసిన పీపీ జి.సత్యం, సీఐ శంకరరావు, ఎస్ఐ లోకేశ్వరరావు, ఏఎస్ఐ మల్లేశ్వరరావు, కోర్టు కానిస్టేబుల్ నాయుడులను ఎస్పీ దామోదర్ అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి మూడురోజులు..

శృంగవరపుకోట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఎస్.కోట జూనియర్ సివిల్ కోర్టు సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ గండి అప్పలనాయుడు ఓవ్యక్తికి మూడురోజులు జైలుశిక్ష విధించినట్లు సీఐ నారాయణమూర్తి తెలిపారు. తమ సిబ్బంది నిర్వహించిన తనిఖీల్లో ఎస్.కోటకు చెందిన దార్లనరేష్ మద్యం సేవించి వాహనం నడుపుతుండగా దేవిజంక్షన్ వద్ద డ్రంకన్‌డ్రైవ్ టెస్ట్‌లో దొరికినట్లు తెలిపారు. ఆయన్ను న్యాయస్థానంలో హాజరుపరచగా మూడురోజులు జైలుశిక్ష విధించినట్లు చెప్పారు.

ఇద్దరికి రూ.10 వేలు జరిమానా

కొత్తవలస, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న ఇద్దరు వ్యక్తులకు కొత్తవలస న్యాయాధికారి డాక్టర్ సముద్రాల విజయచందర్ వారంరోజులు జైలు శిక్ష, 10 వేల రూపాయలు జరిమానాను సోమవారం విధించారు. కొత్తవలస సీఐ షణ్ముఖరావు కథనం మేరకు.. సీఐ షణ్ముఖరావు, సిబ్బంది వాహనాలను తనిఖీలు చేస్తుండగా మంగళపాలెం గ్రామానికి చెందిన వాహనచోదకుడు, బలిఘట్టాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం సేవించి వాహనాలను నడుపుతున్నట్లు గుర్తించారు. సీఐ వీరి ఇద్దరిపై కేసలు నమోదు చేసి సోమవారం కొత్తవలస కోర్టులో హాజరుపరిచారు. వీరికి ఒక్కొక్కరికి వారం రోజులు పాటు జైలు శిక్ష, 10 వేల రూపాయలు చొప్పున జరిమానా విధించారు.

దత్తిలో గడ్డికుప్ప దగ్ధం

దత్తిరాజేరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని దత్తి గ్రామంలో పశువుల మేతకోసం రైతులు నిల్వ చేసిన గడ్డి కుప్ప సోమవారం దగ్ధమయ్యింది. గ్రామస్థుల కథనం మేరకు.. చోడవరం బంగారయ్యకు చెందిన గడ్డికుప్పతోపాటు రాపాక రాములకు చెందిన కొద్దిమేర వరి పడుగు అగ్నిప్రమాదంలో ఆహుతయ్యింది. ఆకతాయి నిప్పంటించడంతో మంటలు వ్యాపించడంతో స్థానికులు సమాచారంమేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అధికారులు నష్టపరిహారం అంచనావేసి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జిందాల్ అక్రమాలపై విచారణ చేపట్టాలి

● ముఖ్యమంత్రికి లేఖ రాసిన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు


ముఖ్యమంత్రికి రాసిన లేఖ చూపిస్తున్న ఇందుకూరి రఘురాజు

ఎస్.కోట రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):జిందాల్‌భూసేకరణలో జరిగిన అక్రమాలపై ముఖ్యమంత్రి స్పందించి న్యాయ విచారణ జరిపించాలని ఎమ్మెల్సీ ఇందుకూరిరఘురాజు కోరారు. సోమవారం బొడ్డవరలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిందాల్ నిర్వాసితులు ఎలా మోసపోయామో నిరసన దీక్షల ద్వారా తెలుసుకున్నారని, ఇన్నాళ్లు జిందాల్ ముసుగు వేసి భూములను ఏవిధంగా దోచుకున్నారో తెలుసుకున్నారన్నారు. వీరు బయటపెట్టిన అక్రమాలపై ముఖ్యమంత్రికి లేఖ రాశానని, వెంటనేకలెక్టర్‌తో ఇక్కడ క్షేత్రస్థాయిలో విచారణ జరిపితే అవినీతి వెలుగులోకి వస్తుందని తెలిపారు. తాము పరిశ్రమలకు ఎప్పుడు వ్యతిరేకంగా లేమని, కేవలం భూమి కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నామని చెప్పారు. ప్రభుత్వం స్పందించి న్యాయంచేస్తే స్వాగతిస్తామని, లేదంటే నమ్ముకున్న న్యాయదేవత తమను గెలిపిస్తుందని తెలిపారు.

విచారణ నిర్వహించి శిక్షించాలి

జిందాల్ భూసేకరణలో కొంతమంది బినామీలు రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కుమ్మక్కై కోట్లు రూపాయిలు కాజేశారని వారిపై విచారణ జరిపి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని జిందాల్ నిర్వాసితులు కోరారు. బొడ్డవరలో 163వ రోజు నిరసన దీక్షలో భాగంగా వారు మాట్లాడుతూ జిందాల్ హరిజన, గిరిజనులకు మోసంచేసిందన్నారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

● భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు


నిరసన తెలియజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

రాజాంరూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):సంక్షేమబోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మికుల సంఘ అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది భవననిర్మాణ కార్మికులపై పభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సోమవారం రాజాంలోని నాలుగురోడ్ల కూడలిలో నిరసన తెలిపారు.ఈసందర్భంగా మాట్లాడుతూ వైసీపీహయాంలో బోర్డు తాత్కాలికంగా నిలిపివేయడంతో కార్మికులకు నష్టంవాటిల్లిందని తెలిపారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేయాలి

రాజాం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజాం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఏఐసీసీ పరిశీలకుడు రాఘవేంద్రదాస్ సూచించినట్లు ఆ పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి కుప్పిలి చైతన్యకుమార్ తెలిపారు.పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పర్యటనకు వచ్చిన రాఘవేంద్రదాస్‌ను జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం కలిశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని వీటి అగ్రహారంలోగల ఉప కేంద్రంలో రూ.తొమ్మిది కోట్లతో అదనపు 50 మెగావాట్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపనుల కోసం మంగళవారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ ఈఈ పి.త్రినాథరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.

నేడు బహిరంగ విచారణ

విజయనగరం కలెక్టరేట్ నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయనగరం తహసీల్దార్ కార్యాలయంలో భూములు ముటేషన్ చేయడానికి లంచం అడుగుతున్నారన్న ఫిర్యాదుపై మంగళవారం బహిరంగ విచారణ చేపట్టనున్నట్లు పీజీఆర్ఎస్ నోడల్ అధికారి, కేఆర్ఆర్‌సీ ప్రత్యేక ఉపకలెక్టరు మురళి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముటేషన్ చేయడానికి, పట్టాదారు పాస్ పుస్తకాలు జారీకి అధికారులు రూ.లక్ష వరకూ డిమాండ్ చేస్తున్నారని రాకోడు గ్రామానికి చెందిన రైతులు పీజీఆర్ఎస్ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో బహిరంగంగా విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. తహసీల్దార్‌కార్యాలయంలో మంగళవారం జరిగే విచారణకు రాకోడు, పరిసర గ్రామాల రైతులు తమ వద్ద ఉన్న ఆధారాలతో హాజరుకావాలని కోరారు.

పుణ్యగిరి హుండీ ఆదాయం రూ.4 లక్షల 78 వేలు

శృంగవరపుకోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పుణ్యగిరి ఉమకోటిలింగేశ్వర స్వామికి కార్తీకమాసం పురస్కరించుకుని రూ.నాలుగులక్షల 78వేలు ఆదాయం వచ్చినట్లు ఈవో నాగేంద్ర తెలిపారు. సోమవారం కొండపై హుండీ ఆదాయం లెక్కించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వైవీ రమణి పాల్గొన్నారు.

రేగ సర్పంచ్‌గా దేముడు

లక్కవరపుకోట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో రేగ సర్పంచ్‌గా లెంక దేముడు ఎన్నికైనట్లు పంచాయతీ కార్యదర్శి తులసి తెలిపారు. డీపీవో ఆదేశాల మేరకు సోమవారం ఎన్నిక నిర్వహించారు. ఇటీవల సర్పంచ్ రావాడ నీలకంఠం మృతిచెందిన విషయంవిదితమే. లెంక దేముడు ఇప్పటివరకు ఉప సర్పంచ్‌గా ఉన్నారు. దేముడును వార్డు సభ్యులంతా ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకున్నట్టు కార్యదర్శి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, ఎంపీటీసీ బొడ్డు గణపతి, దుంగ రమణ పాల్గొన్నారు.

డీటీ జగన్నాథరావు మృతి

నెల్లిమర్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల విభాగం డీటీగా పనిచేస్తున్న వీవీఆర్ జగన్నాథరావు (53) విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. నాలుగు రోజుల కిందట కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా తీవ్రమైన తలనొప్పితో బాధపడుతూ కూర్చొన్న కుర్చీలోనే కుప్పకూలిపోయిన సంగతి తెలిసిందే. వెంటనే తొలుత మిమ్స్, తర్వాత విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించి చికిత్స అందజేసినా ప్రయోజనం లేకపోయింది. సోమవారం ఆయన మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. గంట్యాడ మండలంలోని వసాది గ్రామానికి చెందిన జగన్నాథరావు ప్రస్తుతం విజయనగరం అయ్యన్నపేట రోడ్డులో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు.ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. జగన్నాథరావు మృతిపై తహసీల్దార్ కె.శ్రీకాంత్, డీటీలు శంకరరావు, సత్యనారాయణ, వీఆర్వోలు, ఎన్నికల విభాగం సిబ్బంది భాస్కరరావు, మహేష్ సంతాపం ప్రకటించారు.

గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించాలి

సంతకవిటి,నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ముట్టడించారు. జీవో-680 ప్రకారం గ్రీన్ అంబాసిడర్లకు కనీస వేతనం రూ.10వేలు చెల్లించాలని హైకోర్టు ఆదేశించినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే అదితి జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే అదితిగజపతిరాజుకి వేదాశీర్వచనం అందజేస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్, నవంబరు 24: విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సిటీబస్టాండ్ వద్ద వినాయకుని ఆలయం, మూడులాంతర్ల వద్ద పైడిమాంబ ఆలయంలో అదితి గజపతిరాజు ప్రత్యేక పూజలు చేశారు. ప్రేమసమాజం, నిరాశ్రయుల ఆశ్రమం, పినవేమలిలో ఏబీసీడీ ఆశ్రమంలో నిరుపేద, పేదలకు వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీచేశారు. పార్టీ కార్యాలయంలో పార్టీ నగర, మండల కమిటీలు ఏర్పాటుచేసిన కేక్‌ను అదితిగజపతిరాజు కట్‌చేశారు. ఎమ్మెల్యేకు గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, ఆయన సతీమణి సునీలా గజపతిరాజు,మంత్రులు నారాలోకేష్, వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, జనసేన నాయకురాలు పాలవలస యశస్వి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ, మునిసిపల్ మాజీ చైర్మన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు,నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గంటా రవి, పీతల కోదండరామ్, పార్టీ మండలాధ్యక్షుడు గంటా పోలినాయుడు, ఏఎంసీ చైర్మన్ కర్రోతు వెంకట నర్సింగరావు, టీడీపీకార్యాలయ కార్యదర్శి పి.రాజేష్‌వర్మ,నాయకులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్,గాజులరేగ పీఏసీఎస్ అధ్యక్షుడు కోరాడ వెంకటరావు, పడాలజోగేష్, సువ్వాడ శ్రీను,వేచలపు శ్రీను,సుంకరిపైడిరాజు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. వీటి అగ్రహారం బీసీ బాలికల వసతి గృహంలో సురక్షిత మంచినీటి కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పథకాన్ని అదితి గజపతిరాజు ప్రారంభించారు. పైడిమాంబ, సింహాచలం, రామతీర్థం దేవస్థానం అర్చకులు అదితి గజపతిరాజుకు వేదాశీర్వచనం అందించారు.

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



రేగిడి: లచ్చన్నవలసలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, అధికారులు

నెల్లిమర్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ తెలిపారు. సోమవారం మండలంలో రామతీర్థంలో అన్నదాత సుఖీభవ, రైతన్నా మీకోసం వారోత్సవాల్లో భాగంగా పర్యటించారు.కార్యక్రమంలో గేదెల రాజారావు, తాడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

●రేగిడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పంటమార్పిడితో భూసారం పెరిగి రైతుకు లాభసాటిగా ఉంటుందని వ్యవసాయశాఖ రాజాం ఏడీ చంద్రరావు, తహసీల్దార్ కృష్ణలత, ఎంపీడీవో శ్యామలాకుమారి తెలిపారు. సోమవారం మం డలంలోని లచ్చన్నవలస, చిన్నశిర్లాం, ఉంగరాడ, దేవుదళ, సంకిలిల్లో వ్యవసాయ శాఖ నిర్వహించిన రైతన్నా- మీకోసం కార్యక్రమం నిర్వహించారు.

●గజపతినగరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎం.వెంకటాపురంలో రైతులకు రైతన్నా-మీకోసం వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆహార భద్రత, పెట్టుబడి తగ్గించడం, మార్కెట్ ఆధారిత పంటలసాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వీవీవీ గోపాలరాజు, ఏడీఏ నిర్మలజ్యోతి , డిప్యూటీ ఎంపీడీవో జనార్దనరావు, ఏవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

●దత్తిరాజేరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండలాధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్ అన్నారు. దత్తిరాజేరులో రైతన్నా-మీకోసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మిత్తిరెడ్డి లక్ష్మి, బండి కృష్ణ, లక్ష్మంనాయుడు, ఆర్ఐ నారాయణరావు, వీఆర్వో బలరాం పాల్గొన్నారు.

●భోగాపురం, నవంబరు24(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని ఏవో కె.హైమావతి తెలిపారు. భోగాపురంలో రైతన్నా -మీకోసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కొమ్మూరుసుభోషణరావు, పల్లంట్ల జగదీష్, బొల్లు త్రినాథ్ పాల్గొన్నారు.

●డెంకాడ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ రంగంలో రాణించినప్పుడే దేశ ఆర్థిక పురోగతి చెందుతుందని తహసీల్దార్ రాజారావు, ఏవో సంగీత తెలిపారు. పెదతాడివాడ, చింతలవలస, పినతాడివాడ, చొల్లంగిపేట, సింగవరం, డెంకాడ రైతు సేవా కేంద్రాల్లో రైతన్నా-మీకోసం కార్యక్రమం నిర్వహించారు.

●రాజాం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒమ్మిలో సర్పంచ్ వంగా వెంకటరావు అధ్యక్షతన రైతన్నా-మీకోసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ కె.చంద్రరావు, ఏవో చీకటి రఘునాథ్ పాల్గొన్నారు,

అటకెక్కిన 'స్వచ్ఛరథాలు'

● నీరుగారిన ప్రభుత్వ లక్ష్యం ● వావిలవలస, అంబాడలో నిరుపయోగంగా మారిన వైనం


ఏవీపురంలో మూలకుచేరిన స్వచ్ఛసంకల్పం వాహనం

రేగిడి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెత్త సేకరణకు కొనుగోలుచేసిన స్వచ్ఛరథాలు అటకెక్కాయి. లక్షలాది రూపాయల వెచ్చించి కొనుగోలు చేసిన ఈ వాహనాల లక్ష్యం నీరుగారుతోంది. క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీల్లో సేకరించిన తడిపొడి చెత్తను చెత్త సేకరణ కేంద్రాలకుతరలించేందుకు స్వచ్ఛరథాలను సమకూర్చింది. తొలుత ప్రారంభంలో ఐదు నెలలపాటు స్వచ్ఛభారత్ మిషన్ కింద డ్రైవర్లకు వేతనాలు ఇచ్చేవారు. తర్వాత వీటి నిర్వహణను పంచాయతీలకు అప్పగించారు. డ్రైవర్లకు వేతనాలు చెల్లించకపోవడంతోపాటు నిర్వహణ భారంగా మారడంతో ఈ వాహనాలు మూలకుచేరాయి. దీంతో ఈ వాహనాల టైర్లు అరిగిపోయాయి. దీనికి పాడవడంతో ఎందుకు పనికి రాకుండా నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు ఈ వాహనాలకు మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

స్కిల్స్ బిల్డ్ పథకంపై అవగాహన

విజయనగరం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయనగరం శివార్లలోని జేఎన్‌టీయూలో ఐబీఎం స్కిల్స్ బిల్డ్ పథకం ఆధ్వర్యంలో ఎ-1 స్కిల్లింగ్ కార్యక్రమంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృత్రిమ మేథస్సు పరిచయం, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, కంప్యూటర్ విజన్, మిషన్ లెర్నింగ్, జీపు లెర్నింగ్, ఎ-1 ఎథిక్స్‌పై నిపుణులు అశ్విన్ చంద్ర, షేక్ ఉస్మాన్ ఘనీ శిక్షణనిర్వహించారు. సీఎస్‌ఈ ఇండియాసీనియర్ మేనేజరు శ్రీరామ్ మోహన్, తాజా పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీసీ వీవీ సుబ్బారావు, రిజిస్ట్రార్ జయసుమ, రాజేశ్వరరావు, హేమ పాల్గొన్నారు.

ఔషధ నిపుణుల పాత్ర ప్రశంసనీయం

జీవనశైలిలో మార్పులకు అనుగుణంగా ఔషధ నిపుణుల పాత్ర ప్రశంసనీయమని జేఎన్‌టీయూ వీసీ వి.సుబ్బారావు తెలిపారు.ఫార్మాసూటికల్ సైన్స్ విభాగంలో ఫార్మసీఉత్సవాలు నిర్వహించారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ జయసుమ పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

చీపురుపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏలు కోరారు. ఈమేరకు సోమవారం చీపురుపల్లిలో ఆర్డీవోకు వీఆర్‌ఏలు వినతిపత్రం అందజేశారు. గామ రెవెన్యూ సహాయకులకు తక్షణమే పేస్కేలు అమలు చేయాలని వారు తమ వినతిపత్రంలో కోరారు.

సారధిలో ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమం

రాజాం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):మునిసిపాలిటీ పరిధిలోని సారధిలో ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థినులు వారం రోజుల పాటు ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా మొక్కలునాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కుమరాపు జనార్దనరావు, డాక్టర్ పీఎల్ఎన్ రాజు, కొత్త సాయిప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

టెన్నీకాయిట్ పోటీలకు పెదనడిపల్లి విద్యార్థుల ఎంపిక

చీపురుపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):పెదనడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు జాతీయస్థాయి టెన్నీకాయిట్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ రామారావు తెలిపారు. ఈనెల 21 నుంచి శ్రీకాకుళం జిల్లా సొండిపూడిలో జరిగిన 37వ రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో పెదనడిపల్లి ఉన్నతపాఠశాల విద్యార్థినులు భారతి, కె.ఇందు, కె.కావ్య సత్తాచాటారు.డిసెంబరు 22 నుంచి 26 వరకూ కేరళలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున వీరు ఆడనున్నట్టు పీడీ పీడీ తెలిపారు. వీరిని హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు అభినందించారు.

ఫిడే ఆర్బిటర్‌గా ప్రసాద్

చీపురుపల్లిలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా సేవలందిస్తున్న ఏడీఎన్ఎస్‌వీ ప్రసాద్ జాతీయస్థాయి చదరంగం ఫిడే ఆర్బిటర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన్ను విజయనగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ పరీక్షల ఆర్ఐవో ఎస్. తవిటినాయుడు సన్మానించారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జశ్వంత్

లక్కవరపుకోట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చందులూరు హైస్కూల్ విద్యార్థి రొంగళి జశ్వంత్ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్టు పీడీ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. అండర్-14 విభాగంలో 120 మంది క్రీడాకారులు పాల్గొనగా జశ్వంత్ అర్హత సాధించాడని చెప్పారు. మంగళవారం నుంచి 27 వరకు కృష్ణా జిల్లాగన్నవరంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జశ్వంత్ పాల్గొంటాడని చెప్పారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి: కమిషనర్

రాజాం, నవంబరు, 24 (ఆంధ్రజ్యోతి): వార్డు సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని మునిసిపల్ కమిషనర్ ఎ.రామచంద్రరావు ఆదేశించారు.మునిసిపాలిటీలోని కొండంపేట వార్డు సచివాలయాన్ని తనిఖీచేశారు. కొంతమంది సిబ్బంది సకాలంలో విధులకు రాకపోవడం, మూమెంట్ రిజిస్టర్‌లో ఎక్కడికి వెళ్లారోనన్న విషయం నమోదు చేయకపోవడంతో మండిపడ్డారు

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు


ఎస్.కోట రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

ఎస్.కోట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతుసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, ఎస్.కోట పీఏసీఎస్ చైర్మన్ జీఎస్ నాయుడు,డైరక్టర్ గెదెల శ్రీను తెలిపారు. సోమవారం మండలంలోని వెంకటరమణపేటలో ఏవో రవీంద్ర ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు డోకుల అచ్చెంనాయుడు, కార్యదర్శి జగదీష్, గోపాలపల్లి సర్పంచ్ ఆడారి మహేశ్వరరావు, వినాయకపల్లి సర్పంచ్ గనివాడ సన్యాసినాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, గ్రామపెద్దలు రాపర్తి సాదు, జుత్తాడ రామసత్యం, తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు మోసపోవద్దు

భోగాపురం, నవంబరు24(ఆంధ్రజ్యోతి): దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని తహసీల్దార్ ఎం.రమణమ్మ, ఏవో హైమావతి తెలిపారు. సోమవారం భోగాపురం సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది జనార్దనరావు, నాయకులు పల్లంట్ల గజదీష్, గుండపు సూర్యారావు, రమణ పాల్గొన్నారు.

●కొత్తవలస, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని రైతు సేవాకేంద్రంలో విక్రయించుకోవాలని కొత్తవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కోళ్ల వెంకటరమణ కోరారు. సోమవారం మండలంలోని వీరభద్రపురంలోని రైతు సేవాకేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏవో రాంప్రసాద్, సీఎస్‌డీటీ చిరంజీవి, టీడీపీ నాయకులు రమేష్,కనకాల శివ,సూరిబాబు, నక్కరాజు చిన రాము, కొరుపలు అప్పారావు పాల్గొన్నారు.

ఐటీడీఏలో అక్రమాలపై విచారణ

(5వ పేజీ తరువాయి)

స్కూల్ అసిస్టెంట్లను, డిప్యూటీ వార్డెన్లను నియమించారు. ● గత ప్రాజెక్ట్ అధికారి కాలంలో టెండర్లు లేకుండా మెస్‌లు, గ్యాస్‌స్టౌవ్‌లు తదితర సామగ్రి కొనుగోలు చేశారు. పాఠశాలల్లో మెస్‌లు బిగించడానికి ప్రధానోపాధ్యాయులకు వేలాది రూపాయలు ఖర్చ య్యాయి. వాటిని ఐటీడీఏ అధికారులు ఇవ్వలేదు. నిధులు దుర్వి నియోగం చేశారని దళిత సంఘాల జేఏసీ సభ్యులు ఆరోపించారు. వీటిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఇటీవల విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ● ఈ మేరకు ఐటీడీఏ పరిధిలోని ఏపీవో జి.చిన్నబాబు, డిప్యూటీ డైరెక్టర్ అన్నదొర, సూపరింటెండెంట్ కె.దేస్‌పై ఉన్నతాధికారులు బుధవారం విచారణ చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఫైళ్లతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. బుధవారం ఉదయం 11గంటలకు దర్యాప్తు జరుగుతుందని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

(5వ పేజీ తరువాయి)

పరిశుభ్రత, మౌలిక వసతులపై నివేదికలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. కార్యాలయ ప్రాంగణాలు, పరిసరాలు, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. పనికిరాని వస్తువులను వెంటనే డిస్పోజ్ చేయాలని సూచించారు. ప్రతి కార్యాలయంలో ప్రజల కోసం మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండాల న్నారు. వాటి ఫొటోలు, వీడియోలను తీసి తక్షణమే జిల్లా అధికా రుల ప్రత్యేక గ్రూపులో పెట్టాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కన్నీటి సంద్రం

(5వ పేజీ తరువాయి)

గుమ్మిడి సంధ్యారాణి పరామర్శించారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రబ్బరు డ్యా మ్ పరిసర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేప ట్టాలన్నారు. ఆమె వెంట ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి, జేసీ యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ వైశాలి తదితరులు ఉన్నారు.

ఉత్తరాంధ్రలో గంజాయి సాగు తగ్గించాం

(5వ పేజీ తరువాయి)

పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన పెట్రోల్ బంక్‌ను సోమవారం డీఐజీ ప్రారంభించారు. జిల్లా పోలీసుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. పెట్రోల్ బంక్ ద్వారా వచ్చే ఆదాయాన్ని సిబ్బంది వెల్ఫేర్‌కు ఉపయోగించుకునే అవకాశం కలుగుతుందన్నారు. ● సీతంపేట రూరల్: సీతం పేటలోని వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వేద ఆశీర్వచనాలతో పాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు

సమస్యల పరిష్కారానికి దృష్టిసారిస్తా



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గరుగుబిల్లి, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షత మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిలకాం, ఉద్దవోలు, పెదగుడబ నుంచి సన్యాసిరాజుపేట, కొంకడివరం, రావుపల్లి నుంచి కొత్తూరు గ్రామాల్లోని రహదారుల దుస్థితిని నాగూరు ఎంపీటీసీ సభ్యుడు ద్వారపురెడ్డి సత్యనారాయణ, సంతోషపురం సర్పంచ్ అంబటి రాంబాబుతో పాటు ఎంపీపీ రామారావు.. ప్రభుత్వ విప్ దృషికి తీసుకు వెళ్లారు. ఉపాధి పథకంలో పనులు చేయాలంటే భయంగా ఉందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. పనులు చేయాలని అధికారులు ఒత్తిడి చేశారని, పనులు పూర్తయిన బిల్లులు చెల్లించలేదన్నారు. ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఎంపీపీతో పాటు పలువురు సభ్యులు ఆరోపించారు. సామాజిక తనిఖీల్లో అక్రమాల నివేదికలతో పాటు ఉపాధి వివరాలను పూర్తిస్థాయిలో అందించాలని ఏపీవో ఈశ్వరమ్మను విప్ ఆదేశించారు. తోటపల్లి బ్యారేజీ పరిధిలోని ప్రధాన కాలువల్లో పూడికతీతలకు అవసరమైన నిధులు మంజూరుకు కృషి చేయాలని కోరారు. అలాగే గృహ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎంతమేర నిధులు మంజూరు చేశారన్న సమాచారం లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. నుంకి నిర్వాసితులకు సంబంధించి పునరావాస ప్రాంతం అభివృద్ధికి చొరవ చూపాలని ఎంపీటీసీ సభ్యుడు వై.శ్రీనివాసరావు, సర్పంచ్ కె.రవీంద్ర కోరారు. సమావేశంలో ఎంపీడీవో పి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు, జడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రస్ట్ బోర్డు చైర్మన్‌కు అభినందనలు

గరుగుబిల్లి, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి శ్రీవెంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల చైర్మన్ మార్కొండ పకీరు నాయుడును సోమవారం తోటపల్లిలో ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, కార్పొరేషన్ డైరెక్టర్లు అంబటి రాం బాబు, అక్కేన మధుసూదనరావు, దేవస్థానం అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ డి.పారి నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.నారాయణస్వామి, విశ్రాంత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.వాసుదేవరావు ఉన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జనసేన కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. సోమవారం వీరఘట్టంలో నివాసంలో ఇటీవల మృతిచెందిన జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్త శివగణేష్ కుటుంబానికి రూ. 5 లక్షల చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఉదయాన ఉదయ్‌భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, తూముల రమేష్, జానీ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించండి

బెలగాం, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మండలంలోని తాళ్లబురిడిలో ప్రభుత్వ భూముల్లోని ఆక్రమణలను తొలగించాలని బీజేపీ మండల అధ్యక్షుడు బి.నాగభూషణం కోరారు. సోమవారం కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డికి ఆయన వినతిపత్రం అందజేశారు. తాళ్లబురిడిలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. బస్సు షెల్టర్‌ను కూడా మూసివేసి ఎదురుగా దుకాణాలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ విషయం పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆయన కోరారు.

34 శాతం రిజర్వేషన్లు కల్పించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణ

బెలగాం, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవాల రామకృష్ణ అన్నారు. డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను వర్తింపజేయాలన్నారు. అలాగే న్యాయస్థానాలు సూచించిన విధంగా కులగణన చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు బూర పండు, సరస్వతుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



తూకం వేస్తున్న ఏఎంసీ చైర్మన్

పాచిపెంట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మోసూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సాలూరు ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని రైతులు తరలించాలన్నారు. గిట్టుబాటు ధరను పొందాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షు డు గూడేపు యుగంధర్, పీఏసీఎస్ అధ్యక్షుడు పి.సింహాచలం, మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు, చల్లా కనకబాబు పాల్గొన్నారు.

మణికంఠ కుటుంబానికి పరామర్శ

గరుగుబిల్లి, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): నందివానివలస గ్రామానికి చెందిన రెడ్డి మణికంఠ తోటపల్లి ఎడమ కాలువలో స్నానం చేయడానికి దిగి ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందిన నేపథ్యంలో ఆ కుటుంబాన్ని సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబాన్ని పరామర్శిం చిన వారిలో ఎంపీపీ ఉరిటి రామారావు, కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు, మండల పార్టీ అధ్యక్షుడు మరడాన నారాయణస్వామి నాయుడు, సింహాచలం, సుమన్ తదితరులు ఉన్నారు.

715 సారా ప్యాకెట్ల స్వాధీనం

పార్వతీపురం టౌన్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): లచ్చిరాజుపేట గ్రామంలో సోమవారం నిర్వహించిన దాడుల్లో 715 సారా ప్యాకెట్లను స్వా ధీనం చేసుకున్నట్టు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ ఎస్.శిరీష తెలిపారు. ఇందుకు సంబంధించి కంట సింహాచలం అలియాస్ డేవిడ్‌ను అదుపులోకి తీసుకు న్నామన్నారు. దాడుల్లో ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారన్నారు.

ఎస్సీ వాడల అభివృద్ధికి కృషి చేయండి

పాలకొండ, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను ఎస్సీ వాడల అభివృద్ధికి ఖర్చు చేయాలని సామాజిక కార్యకర్త సబ్బ నానాజీ కోరారు. సోమవారం పార్వతీపురంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో డీఆర్‌వోకు ఆయన వినతిపత్రాన్ని అందజేశారు.

33 మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు పదోన్నతి

కురుపాం, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): కురుపాం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరి ధిలో 33 మంది మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు మెయిన్ కార్యకర్తలుగా పదోన్నతి లభించిందని ఐసీడీఎస్ పీవో జి.రజినిదుర్గ తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించిన కార్య క్రమంలో రా ష్ట్ర మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చేతుల మీదు గా జియ్యమ్మవలస మండలంలో ఏడుగురికి, కురుపాం మండలంలో 26 మందికి పదోన్నతి ధ్రువపత్రాలను అందజేశారన్నారు.

29 వరకూ 'రైతన్నా మీకోసం'



నెలిపర్తిలో అవగాహన కల్పిస్తున్న ఏవో

సాలూరు, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): నెలిపర్తిలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం నిర్వహించారు. ఈ నెల 29 వరకు కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్టు మండల వ్యవసాయాధికారి కె.శిరీష తెలిపారు. వ్యవ సాయశాఖ, అనుబంధ శాఖల సిబ్బందితో రోజుకు 30 క్లస్టర్లలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రతి క్లస్టర్‌లో మూడు రైతు కుటుంబాలను కలిసి వివిధ అంశాలపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు.

●జియ్యమ్మవలస, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే రైతన్నా మీకోసం కార్యక్రమం ఉద్దేశమని మండల వ్యవసాయాధికారి ఆర్.విజయ భారతి అన్నారు. సోమవారం అంకవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏవో, అనుబంధ శాఖల సిబ్బంది.. వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు పంటల మార్పిడికి ప్రాధాన్యమివ్వాలన్నారు. చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

●సీతానగరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రారంభించిన రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వ్యవసా య అధికారి ఎస్.అవినాష్ కోరారు. సోమవారం పదెభోగిలిలో విద్యుత్, పశు వైద్య, వ్యవసాయ సహాయకులతో కలిసి రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆయా శాఖల అధికార సిబ్బంది వివరించడంతో పాటు రైతుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

రైతును రాజును చేయడమే లక్ష్యం

●మక్కువ రూరల్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): రైతులను ఆర్థికంగా బలోపేతం చేసి రాజుగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభు త్వం చర్యలు చేపడుతోందని టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణు గోపాలనాయుడు అన్నారు. సోమవారం ఎ.వెంకంపేటలో నిర్వహించిన రైతన్నా.. మీ కోసం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే ఎన్నికల హామీలన్నీ నెరవేర్చిందన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతోందన్నారు. మండల వ్యవసాయశాఖాధికారి చింతల భారతి మాట్లాడుతూ మండలంలో 24 నుంచి 30వరకు రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరందించడం, బిందు సేద్యాన్ని ప్రోత్సాహించడం, డిమాండ్ ఉన్న పంటలను సాగుచేయించడం, రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను అందించడం, డ్రోన్‌ల వాడకంపై రైతులకు అవగాహన కల్పిం చడం వంటి అంశాలను వివరిస్తామన్నారు.

కరాసువలసలో 'అన్నదాతా సుఖీభవ'

సాలూరు, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): కరాసువలసలో సోమవారం అన్నదాతా సుఖీభవ కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనిట్ ఇన్‌చార్జి అప్పి కొండ యుగంధర్, ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి ఈ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులను ఆదుకునేందుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం, రాయితీపై విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలను అంద జేస్తోందన్నారు. వాటిని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

పీజీఆర్‌ఎస్‌కు 97 వినతులు



వినతులను స్వీకరిస్తున్న ఇన్‌చార్జి ఏపీవో

సీతంపేట రూరల్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఇన్‌చార్జి ఏపీవో ఆర్.వి.గణేష్ 97 వినతులను స్వీకరించారు. అంత్యోదయ కార్డు ఇప్పించాలని సవర వెంకటరావు కోరారు. తన భూమికి 1బి అడంగల్ ఇప్పించాలని సవర కరువయ్య వినతిపత్రం అందజేశారు. కోళ్లఫారం పెట్టుకోవడానికి రుణం మంజూరు చేయాలని మానాపురం గ్రామానికి చెందిన ఆరిక వినీత్ అర్జీని అందజేశాడు. బ్యాటరీ స్ప్రేయర్ కోసం నందిని, దుక్కి పశువుల రుణం కోసం కృష్ణారావు, నూర్పిడి యంత్రం, వీధి కాలువ నిర్మాణం చేపట్టాలని అడ్డాకులగూడ, జక్కరవలస గ్రామాలకు చెందిన సవర మాధవరావు, గంగయ్య వినతిపత్రాలు అందజేశారు. చినవంగర కార్యక్రమంలో టీడబ్ల్యూ ఈఈ పి.రమాదేవి, జీసీసీ బి.ఎం.కృష్ణారావు పాల్గొన్నారు.

చిన్నపల్లంకిలో మలేరియా పరీక్షలు



మురుగునీటిని మళ్లించే చర్యలను పరిశీలిస్తున్న అధికారులు

సీతంపేట రూరల్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): చిన్నపల్లంకిలో సోమవారం దోనుబాయి వైద్య సిబ్బంది మలేరియా పరీక్షలను నిర్వహించారు. మాఊరికి మలేరియా వచ్చింది కార్యక్రమంలో భాగంగా అనుమానితులను గుర్తించి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేపట్టారు. ఈ గ్రామంలో బి.హర్షవర్ధన్ అనే బాలుడికి మలేరియా పాజిటివ్ రావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. వైద్య పరీక్షలు నిర్వహిం చడంతో పాటు యాంటీ మలేరియా స్ప్రేయింగ్, శానిటేషన్, క్లోరినేషన్, అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి భానుప్రతాప్, మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్, సబ్‌యూనిట్ అధికారి జె.మోహనరావు పాల్గొన్నారు.

నేటి నుంచి పుస్తక మహోత్సవాలు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ

బెలగాం, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో పుస్తక మహోత్స వాన్ని మంగళవారం నుంచి డిసెంబరు 5 వరకు నిర్వహి స్తామని విజయవాడ బుక్ ఫెస్టివల్ నిర్వాహకుడు కిరణ్ తెలిపారు. సోమ వారం సీఐ రంగనాథంని కలిశారు. ఈ సందర్భంగా సీఐ బుక్ ఫెస్టివల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పుస్తక పఠనం మనిషికి మంచి ఆలోచనలు, విలువలు, క్రమ శిక్షణ పెంపొందిస్తా యన్నారు. పుస్తక మహోత్సవాలు సమాజంలో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుతాయన్నారు. పుస్తక మహోత్సవాలకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కవి, చిత్రకారుడు పి.రోహిణీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడికి సత్కారం

గుమ్మలక్ష్మీపురం, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): జియమ్మవలస, గుణదలో సోమవారం పర్యటించిన ఎస్టీ కమిషన్ సభ్యుడు కిల్లో సాయిరాంను కురు పాం ఏఎంసీ చైర్‌పర్సన్ కె.కళావతి, కురుపాం టీడీపీ ఎస్టీ సెల్ కార్యదర్శి ఎం.సుబ్బారావు సత్కరించారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం టీజేపీ మండల కన్వీనర్ కె.అప్పలస్వామి, దుమ్మంగి సర్పంచ్ పి.క్రాంతికుమార్, కె.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో గిరిజన విద్యార్థుల ప్రతిభ

సీతంపేట రూరల్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కరాటే, కిక్ బాక్సింగ్ పోటీల్లో సీతంపేట మండలం అచ్చెబ గ్రామానికి చెందిన ఇద్దరు గిరిజన విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయిలోనే రాణించారు. ఈనెల 23న శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ 2025 పోటీలు హేమంత్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరి గాయి. కరాటే పోటీల్లో అచ్చెబ గ్రామానికి చెందిన కె.దీపక్, ఎన్.హర్ష, కటాస్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారు. ప్రతిభ చాటిన గిరిజన క్రీడా కారులను కోచ్ కె.సందీప్‌తో పాటు గ్రామస్థులు అభినందించారు.

104 వాహనంలో ఆకస్మిక తనిఖీ

సీతానగరం, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 104 వాహనా న్ని జిల్లా మేనేజర్ కృష్ణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహ నం కండీషన్‌పై ఆరా తీశారు. వాహనంలో ఉన్న పరికరాలను పరిశీలిం చారు. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తక్షణమే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఈశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



అవగాహన కల్పిస్తున్న ఫీల్డ్ అధికారి

గరుగుబిల్లి, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ బ్యాంకుల పరిధిలోని ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని గరుగుబిల్లి ఫీల్డ్ అధికారి సంతోష్‌కుమార్ అన్నారు. సోమవారం బీవీ పురం, గరుగుబిల్లి పంచాయతీల్లో ఆర్థిక సమ్మేళనంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు సక్రమ పద్ధతుల్లో చెల్లించాలన్నారు. నిర్ణీత సమయంలో చెల్లింపులు చేస్తే రుణభారం తగ్గుతుందన్నారు. పొదుపు సంఘాలతో పాటు చిరు వ్యాపారులకు రుణాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బి.రామకృష్ణ, జిల్లా ఇన్‌చార్జి నారాయణరావు, చానల్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఉల్లాస్'ను విజయవంతం చేయాలి

బొబ్బిలి, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతి ష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు పిలుపునిచ్చారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులు గా మార్చాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు. వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అక్షరాంధ్ర (ఉల్లాస్) ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కౌన్సిల్ భవనంలో సోమవారం నిర్వహించిన వలంటీర్ల ఎంపిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి మాట్లాడుతూ వలంటీర్లంతా స్వచ్ఛందంగా పాల్గొని బొబ్బిలిలో నిరక్షరాస్యత శాతం పెరిగేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వయో జన విద్యాశాఖ పర్యవేక్షకుడు జయరాం, రిసోర్స్‌పర్సన్లు గురు మూ ర్తి, డా.శంకర్రావు, జగన్మోహనరావు, వేణు గోపాలరావు, కమ్యూ నిటీ ఆర్గనైజర్లు పోలినాయుడు, రామలక్ష్మి, చిట్టమ్మ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

బొబ్బిలి రూరల్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో రవికుమార్ అధ్యక్ష తన సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సామాన్యుడికి అధికారులకు మధ్య వారధిగా పనిచేస్తోం దన్నారు. ప్రతి పౌరుడికి సమాచార హక్కు చట్టం బ్రహ్మాస్త్రం లాం టిదన్నారు. ప్రజలకు జావాబుదారీగా ఉండేందుకు 20 ఏళ్ల క్రితం సమాచార హక్కు చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో జాగాన విజయ లక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు, ఏవో అప్పారావు ఉన్నారు.

ఇసుక ర్యాంపులో సబ్ కలెక్టర్ తనిఖీ

పాలకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చినమంగళాపురం ఇసుక ర్యాంపులో సబ్‌కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ సోమవారం రాత్రి తనిఖీ చేశారు. అనుమతుల్లేకుండా ఇసుక తవ్వకాలకు వినియోగిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేశారు. దీని వెనుక ఎవరు న్నారో ఆరా తీయాలని, రోజూ రాత్రి వేళల్లో ప్రత్యేక తనిఖీలు చేప ట్టాలని ఎస్ఐ ప్రయోగమూర్తిని ఆదేశించారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయండి

పాలకొండ, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం డిమాండ్ చేసింది. సోమవారం బుక్కూరులో లేబర్ కోడ్‌ల జీవో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘం అధ్యక్షుడు గోరు పద్మ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లుగా తేవడం కార్పొరేషన్ ప్రయోజనాలు కోసమేనన్నారు. దీన్ని ఐద్వా తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. నిరసనలో హిమప్రభ, గౌరి, శిరీష, రమణమ్మ, రామలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

వీఆర్ఏలకు పేస్కేల్ చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్ఏలు

పాలకొండ, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): వీఆర్ఏలకు పే స్కేల్ జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.ఈశ్వరరావు, కార్యదర్శి ఎన్.గోపి, కోశాధికారి బి.తిరుపతిరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. అనంతరం ఏవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్ఏలకు నైట్ డ్యూటీలు రద్దు చేయాలన్నారు. నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలన్నారు. 2018లో ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.6,500 నుంచి రూ.10,500 వేతనం చేశారన్నారు. డీఏ 300 రూపాయలు ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం డీఏ ను కూడా రికవరీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బి.దిలీప్, సరోజని, కృష్ణ, రాజారావు, కొండలరావు, ప్రసాద్ రామయ్య, తదితరులు పాల్గొన్నారు.